క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



కుప్పాలపల్లెలో పర్యటిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

వేంపల్లె : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ అన్నారు. సోమవారం మండలంలోని కుప్పాలపల్లి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో కులాయమ్మతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చెత్త సంపద సృష్టి కేంద్రంలో చెత్త సేకరణ చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చెత్త సేకరణ వలన ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. సహజంగా ఎరువులను తయారు చేసి పంట పొలాల్లో వేస్తే సారవంతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ కృష్ణ సుమంత్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలో వర్షాలకు కొండూరు గ్రామ పొలాల్లో దెబ్బతిన్న వరి పంటను సోమవారం వ్యవసాయాధికారి కృష్ణ సుమంత్ రెడ్డి పరిశీలించారు. వర్షాలు విస్తారంగా కురవడంతో పంట కోతకు వచ్చే సమయంలో వర్షానికి పడిపోయిందని రైతులు వాపోయారు. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే కొండూరు రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని తనిఖీ చేశారు. అవసరమైన ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ఎర్రగుంట్ల : ఆశా కార్యకర్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తాహసీల్దార్ శోభన్‌బాబుకు ఆశాలు వినతి పత్రం అందించారు. ఆశాలకు వేతనాలు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగులుగా గుర్తింపు జీవోను జారీ చేయాలన్నారు. కనీస వేతనాలు అందించాలన్నారు. నాణ్యమైన యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో ఆశాలు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు ఆశాలకు అమలు చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

లింగాల: మండలంలోని మురారి చింతల గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో లింగాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ గౌతమి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్నకుమార్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

లింగాల : ఈ నెలాఖరులోపు సాగు చేసిన పంటకు ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని మురారిచింతల, గుణకణపల్లె, రామనూతనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ రమేష్ రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పంట సాగు చేసిన ప్రతి రైతు కూడా రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు

కమలాపురం: వరి పంటకు అగ్గి తెగులు సోకిందని, సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట దిగుబడులను కాపాడుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గంగవరం గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు అగ్గి తెగులు లక్షణాలు ఆశించాయన్నారు. ఆకులపై గోధుమ రంగు అంచులతో ఉండి మధ్యలో బూడిద రంగు గల నూనె కండ ఆకారపు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోయి తగలబడినట్లు కనిపిస్తాయని ఆయన తెలిపారు. పిలక కనుతుల వద్ద ఈ తెగులు ఆశిస్తే ఆ ప్రదేశం వద్ద వెన్నులు విరిగి కిందకు వాలిపోయి తాలులేని సగం గింజలు ఏర్పడతాయని తెలిపారు. వాతావరణంలో అధిక తేమ శాతం, తక్కువ ఉష్ణోగ్రతలు లేక పోవటం, వర్షపు జల్లులు కురవడం తదితర వాతావరణ పరిస్థితులతో అగ్గి తెగులు ఉధృతి అధికం అవుతుందన్నారు. ఈ లక్షణాల నివారణకు 1.5 మి.లీ. ఐసోప్రతియోలోన్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా 0.6 మి.లీ. ట్రై సైక్లోజోల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేవీ ఆలయం.. ఉత్సవ శోభితం



పులివెందుల టౌన్ : దీక్షాబంధన అలంకారంలో అంకాలమ్మ



ఎర్రగుంట్ల: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు



జమ్మలమడుగు: పార్వతిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



కమలాపురం: దీక్షాబంధన అలంకారంలో కన్యకాపరమేశ్వరి దేవి



ఆర్టీపీపీలోని చౌడేశ్వరీ ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో..



వేముల: దీక్షాబంధన అలంకారంలో నల్లనమ్మ తల్లి

- ప్రారంభమైన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు
- బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో వాసవీమాత
- ఆలయాలకు కొత్త శోభ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో శరన్నరాత్రుల మహోత్సవాలతో ఆలయాలకు కొత్త శోభ సంతరించుకుంది. చలువ పందిళ్లతో, విద్యుత్ దీప కాంతులతో మిరిమిట్లు గొలుపుతూ ఎంతో అందంగా ఆలయాలు ముస్తాబు చేశారు. తొలిరోజు సోమవారం పట్టణంలోని అమ్మవారిశాల, శ్రీఅంకాలమ్మ, శ్రీవేంకటరమణుడి ఆలయాల్లో దసరా ఉత్సవాలతో కొత్తశోభను సంతరించుకున్నాయి. సోమవారం స్థానిక అమ్మవారిశాలలో బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారిని సుగంధ దివ్యపరిమళ పుష్పాలతో అలంకరించారు. అమ్మవారు దేదీప్యమాన రూపంతో వెలిగిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసుల శ్రేష్టి దంపతులచే హోమాలు నిర్వహించారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈఓ రమణల ఆధ్వర్యంలో అంకురార్పణతో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలోని శ్రీమాలేగంగమ్మ ఆలయంలో గంగమ్మతల్లి అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేంకటరమణుడి ఆలయంలో..

దేవి శరన్నవరాత్రుల దసరా ఉత్సవాల్లో భాగంగా వేంకటరమణుడి ఆలయంలో సోమవారం వేంకటరమణుడు శ్రీమత్స్యావతారం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పెండ్లిమర్రి: పొలతలలో బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

దసరా ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని స్థానిక శ్రీఅంకాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు వివిధ రూపాలలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తరించి ఆమె కృపకు పాత్రులు కావాలన్నారు. దసరా ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం పొలతల క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమించారు. ముందుగా అమ్మవారికి ఆలయ ఈఓ క్రిష్టానాయక్, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు చేశారు.



వీరపునాయునిపల్లె: గజలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన తలపనూరు గంగమ్మ

ప్రారంభమైన దసరా ఉత్సవాలు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో



పులివెందుల టౌన్ : అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

స్వామివారికి అర్చకులు హరిప్రసాద్ శర్మ, పవన్ కుమార్ శర్మ లు పంచామృతాభిషేకం, అష్టోత్తర నామావళి కార్యక్రమాలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : దసరా ఉత్సవాల సందర్భంగా యర్రగుంట్ల, చిలంకూరు, ఆర్టీపీపీలలో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమించారు. యర్రగుంట్ల పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయలో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో, ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో, ఆర్టీపీపీలోని చౌడేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న ఆర్యవైశ్యులు

జమ్మలమడుగు: పట్టణంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి పార్వతి దేవిగా, అంబ భవాని గీతోపదేశ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవి నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న జ్ఞాన వేంకటేశ్వర ఆలయంలో, కన్నెలూరులోని రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

కమలాపురంలో..

కమలాపురం: అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకట రమణయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో యువజన సంఘం సహకారంతో సోమవారం నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కమిటీ అధ్యక్షుడి నివాసం నుంచి అమ్మవారికి బంగారు కిరీటం, బంగారు చీర తదితర వాటిని ఊరేగింపుగా తీసుకువెళ్లి అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు మొదటి రోజు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. బచ్చు సత్యనారాయణ కుటుంబ సభ్యులు అలంకారానికి దాతలుగా వ్యవహరించారు. తల్లం రజనీకాంత్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీర సమర్పించారు.

వేముల: మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలోని నల్లనమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం ఆలయంలో నల్లనమ్మ అమ్మవారు దీక్షాబంధనిదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

ఎర్రగుంట్ల : తెలంగాణ తరహాలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం, ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీపీపీ పవర్ హౌస్ గేటు వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ రెండు యూనియన్ నాయకులు మాట్లాడుడూ కాంట్రాక్ట కార్మికుల 2022 పీఆర్సీ ఆరియర్స్ వెంటనే చెల్లించాలని, భూములు కోల్పోయిన వారిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షలో ముస్తాఫా, పవన్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు, చంద్రమోహన్‌రెడ్డి, గుర్రప్ప కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌వీకేఎస్, బీఎంఎస్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ర్యాలీ

డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీపీపీలోని వీవీరెడ్డి నగర్ పౌంటైన్ వద్ద నుంచి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలు వేశారు. ర్యాలీగా వెళ్లి ఆర్టీపీపీ పరిపాలన అధికారి సోమశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతు విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కానందున ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

ఆడ, మగ పిల్లల నిష్పత్తి సమానంగా ఉండాలి

పులివెందుల టౌన్ : ఆడ, మగ పిల్లల నిష్పత్తి సమానగా ఉండాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనన్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఉప జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ గురించి డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనన్య మాట్లాడుతూ గర్భిణులు స్కానింగ్ సెంటర్లకు పోయినప్పుడు ఆడ, మగ లింగ నిర్ధారణ గురించి అడగరాదన్నారు. డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రతినెలా పులివెందల డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తూ డెకాయ్ ఆపరేషన్ ద్వారా అనుమానిత సెంటర్లను పరిశీలిస్తున్నామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాల వైద్యులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు ఫాం–ఎఫ్‌లు ఆన్‌లైన్ చేసేలాగా చూస్తున్నామని పేర్కొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, వైద్య సిబ్బంది

పోస్టర్ల ఆవిష్కరణ

పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని అర్బన్ ప్రాథమిక వైద్యశాలలో సోమవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్లను డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజా మొద్దీన్ ఆవిష్కరించారు. పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంత కుమార్, సూపర్ వైజర్ సతీష్, సీడీఎస్ మేనేజర్ వలి, ఎస్ఏహెచ్ఎస్ సంస్థ అధ్యక్షులు రాజు, డీపీఎం సుబ్బారెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాపాఘ్ని నదిలోకి పిల్లలను పంపకండి

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నదిలోకి పిల్లలు, పెద్దలు, యువత వెళ్లితే నీటి మడుగులో చిక్కుకొనే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ హరినాథ్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక పాపాఘ్ని నది ప్రాంతంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో పాపాఘ్ని నదిలో గుంతలు ఉన్న చోట ప్రమాద సూచికను తెలుపుతూ ఎర్ర జెండాలను నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాపాఘ్ని నదికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోందని, పాపాఘ్ని నదిలో ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరగడంవలన భారీగా గుంతలు ఏర్పడ్డాయన్నారు. దసరా సెలవులు రావడంతో పిల్లలు సరదా పాపాఘ్ని నదిలోకి వెళ్లి నీటి కుంటలో ఇరుక్కుని ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు దసరా సెలవుల్లో పిల్లలను బయటికి పంపకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్థానికులు ఫారూఖ్, మహమ్మద్, మదార్, హైదర్, దర్బార్, మౌల్లా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పెషల్ బస్సులు నడపాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులకు స్పెషల్ బస్సులను నడపాలని ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో పరిమితికి మించి విద్యార్థులు బస్సులో ఎక్కుతున్న విషయాన్ని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ గమనించి ఆర్టీసీ డీఎం రామకృష్ణ, సీఐ సీతారామిరెడ్డిలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి దినేష్ కుమార్ మాట్లాడుతూ పులివెందుల నుంచి కోమన్నూతల బస్సు పరిమితి 45 సీట్లు అయితే 160 మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రద్దీకి అనుగుణంగా బస్సులను పునరుద్ధరించాలని కోరారు.

పేదల పక్షపాతి లింగమూర్తి




లింగమూర్తి స్మారక స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

చింతకొమ్మదిన్నె : కామ్రేడ్ లింగమూర్తి పేదల పక్షపాతి అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకరరెడ్డి అన్నారు. సోమవారం విశ్వనాధపురంలోని హిందూ స్మశాన వాటికలోని లింగమూర్తి స్మారక స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లింగమూర్తి ప్రజల తరపున పోరాడే ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. జిల్లాలో కమ్యూనిస్టు నాయకుల్లో మొదటితరం నాయకుడని, ఆయన నిరంతరం పేద ప్రజల అభివృద్ధి కోసం పరితపించాలని ప్రశంసించారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించి సాధించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించడం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాష, నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చేపల సుబ్బరాయుడు, రమేష్, విజయ్ కుమార్, మునిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలిరెడ్డి, రవి పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులోనే బస్సులు నడపాలి

కొండాపురం: కొండాపురం పట్టణంలో నాలుగు వరుసల జాతీయ రహదారి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో ఆర్టీసీ బస్సులు తిరిగేలా డ్రైవర్లు, కండెక్టర్లను అదేశించినట్లు తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. సోమవారం ఆయన కొండాపురంలో సర్వీస్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో రోడ్డును పరిశీలించామని తెలిపారు.

సాంకేతిక సాగుతోనే లాభాలు



మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్న కృష్ణప్రియ

కమలాపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో శాస్త్ర సాంకేతికవైపు రైతులు అడుగులు వేస్తేనే లాభాలను పొందవచ్చని డీఏఏటీటీసీ సమన్వయకర్త డాక్టర్ కృష్ణ ప్రియ తెలిపారు. సోమవారం మండలంలోని టి.చదిపిరాళ్ల ఆర్ఎస్‌కేలో మహిళా రైతులకు వ్యవసాయంలో మినుము పంట ఉత్పత్తి, ఆధునిక సాంకేతికను ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో మినుము పంటను సాగు చేయడం, నాణ్యమైన గింజల ఎంపిక, నీటి నిర్వహణ, తెగుళ్ల నివారణ, ఉత్పత్తి పెంపొందించే సాంకేతికతల గురించి వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మహిళా రైతులు తమ సాగు పద్ధతులను మెరుగు పరచుకోవడానికి, ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం లభించిందని వివరించారు. వ్యవసాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

దొమ్మర కులస్తులను బలిజ కులంలో చేర్చడం సరికాదు

పులివెందుల టౌన్ : దొమ్మర కులస్తులను గిరి బలజలుగా మార్చి బలిజ కులంలో చేర్చడం సరికాదని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి బలిజ సంఘం నాయకులు ఆర్డీఓ చిన్నయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం దేవర కమిటీ, బలిజ సంఘం సీనియర్ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1793 వెంటనే రద్దు చేయాలని, దొమ్మర కులస్తులను పేరు మార్చి గిరి బలిజలుగా గుర్తిస్తున్నట్లు జీఓను ఇవ్వడంతో బలిజ కులస్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఇలాంటి దుర్మార్గమైన చర్య హేయమైందన్నారు. వెంటనే జీవో నంబర్ 1793ను బలిజ కులస్తులందరూ వ్యతిరేకిస్తున్నారని, వెంటనే జీఓను రద్దు చేయకపోతే బలిజ కులస్తులకు చెందిన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, ఉద్యమాలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ ప్రధాన కార్యదర్శి రాచనేని ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు సోపాల వీరా, నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, తోటంశెట్టి హరి, సుబ్బరాయుడు, సర్వేశ్వరుడు, సాగర్ బాబు, శ్రీపతి చక్రవర్తి, హరీష్, రామ్మోహన్, అంబకపల్లె బాబు, తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 1793 రద్దు చేయాలి

సింహాద్రిపురం : ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1793 వెంటనే రద్దు చేయాలని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు తహసీల్దార్‌ను కోరారు. సోమవారం మండల కేంద్రమైన రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డిని బలిజ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం మండల అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం దొమ్మర కులస్తులను పేరు మార్చి గిరి బలిజలుగా గుర్తిస్తున్నట్లు జీఓను ఇవ్వడంతో బలిజ కులస్తుల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గపు చర్యగా ఉందన్నారు. జీవో నెంబర్1793 వెంటనే రద్దు చేయకపోతే బలిజ కులస్తులకు చెందిన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, ఉద్యమాలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు సాయి, రామకృష్ణ, సంగన్న, నాగ శంకర్, రాంబాబు, రమణ, మధు, బాల్జీ, యశ్వంత్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందిస్తున్న బలిజ సంఘం నాయకులు

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పులివెందుల టౌన్ : పులివెందులలో ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీవరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ పులివెందుల పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులోని కొత్త ఆర్టీసీ బస్టాండు, అంబకపల్లె రోడ్డులోని మినీ సెక్రటేరియట్‌లో ఆధార్ నమోదు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కొలుముల పల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం, ఇప్పపెంట గ్రామ సచివాలయంలో బుధవారం, చింతకొమ్మదిన్నె గ్రామ సచివాలయంలో 25, 26 తేదీలలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ముద్దనూరు: మండలంలో మంగళవారం నుంచి ముద్దనూరు, కొర్రపాడు,పెనికలపాడు–1 సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాధాకృష్ణాదేవి సోమవారం తెలిపారు. 23నుంచి 26వతేదీ వరకు ముద్దనూరు సచివాలయంలో, 24,25 తేదీల్లో కొర్రపాడు సచివాలయంలో, 26న పెనికలపాడు–1 సచివాలయంలో ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహించనున్నట్లు, ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

కొండాపురం: సేంద్రియ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభి స్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనజర్ ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చౌటిపల్లె పునరావాస కాలనీ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 25 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కల సాగుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా స్కూల్‌లోనే అన్నిరకాల ఆహార ఉత్పత్తులు పండించాలనే ఉద్దేశంతో ఈ మోడల్ పద్ధతిలో కూరగాయాలను సాగు చేస్తున్నామని తెలిపారు. ఈ మోడల్స్ అన్ని పాఠశాలల్లో ప్రవేశపెడుతామని పేర్కొన్నారు. అనంతరం సాగు చేస్తున్న కూరగాయలకు వేప కషాయంతో (జీవామృతం) పిచికారి చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మోడల్ మేనేజర్ ఐవీ రమణ ప్రిన్సిపాల్ మాధవి, సీఆర్‌పీలు సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.



ఆకుకూరలకు కషాయాన్ని పిచికారి చేస్తున్న దృశ్యం